
పెదకొండూరు ర్యాంప్ రోడ్డులోకి చొచ్చుకొచ్చిన వరదనీరు


మంగళగిరి మండలం చినకాకాని దీనదయాళ్ నగర్‌లో ఇదీ దుస్థితి


చిర్రావూరులో కరకట్ట వద్ద నీట మునిగిన పంట పొలాలు

ముంపు.. జలదరింపు

వాన బీభత్సం
- మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలు జలమయం
- వరద బాధిత ప్రాంతాల్లో నాయకులు, అధికారుల పర్యటన
- పునరావాస కేంద్రాల ఏర్పాటు

వాన బీభత్సంతో మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో ముంపు విలయతాండవం చేస్తోంది. చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. ఊళ్లు, కాలనీలు నీళ్లలో నానుతున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు కృష్ణానదీ ఉధృతంగా ప్రవహిస్తోండడంతో పరీవాహక ప్రాంతాల్లోని ప్రాంతాలు నీటమునిగాయి. అధికారులు, నాయకులు ఆదివారం వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులను తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాథమికంగా పంట నష్టాలు ఇలా...

పంట	దెబ్బతిన్న విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	1550
అరటి	235
కూరగాయలు	230
పసుపు	179
బొప్పాయి	16
సొరకాయ	10
పూలు	63

మంగళగిరి/తాడేపల్లిరూరల్: మంగళగిరిలోని చిన కాకాని దీన దయాళ్ నగర్, రత్నాల చెరువు ఎస్టీ కాలనీ, పావురాల కాలనీ ముంపునకు గురయ్యాయి. నియోజకవర్గంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పంట పొలాలు నీటమునిగాయి. కాజ, చిన కాకాని, ఆత్మకూరు, పెదవడ్లపూడి, చిన వడ్లపూడిలలో వరి పొలాలు నీటిలో నానుతున్నాయి. నూతక్కి, రామచంద్రపాలెంలో అరిటి వరి, పసుపు, పంటలు దెబ్బతిన్నాయి. మంగళగిరి మండలంలోని ఏడు గ్రామాల్లో సుమారు 1,550 ఎకరాల్లో వరి పంట నీటపాలై 400 మంది రైతులు నష్టపోయారని, 20 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అలాగే ఎనిమిది గ్రామాల్లో 733 ఎకరాల్లో అరటి, పసుపు, కూరగాయలు తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ ప్రాంతాలను నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల, వైఎస్సార్ సీపీ నేతలు పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ నగరంలోని బీఆర్ స్కూల్, కొత్తపేట, మున్సిపల్ హైస్కూలు, వీవర్స్ కాలనీ, కళావేదిక, రాయల్ కన్వెన్షన్‌లలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ముంపు బాధితులను ఈ కేంద్రాలకు తరలించి అక్కడ వారికి అన్ని వసతులూ కల్పిస్తామని ఆమె వెల్లడించారు.

ప్రజలను ఆదుకోవాలి

భారీ వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, దుగ్గిరాల మండల సీపీఎం కార్యదర్శి జెట్టి బాలరాజు పర్యటించారు. ప్రజలు, రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరం, అద్దంకి పాములు, దుర్గా ప్రసాద్, నాగమణి, సీపీఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, అమ్మిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


దుగ్గిరాల మండలం పెదకొండూరులో నీటిలో మునిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


నూతక్కిలో అరటి పంటలో ముంపునీరు


రోడ్డుపైకి వచ్చిన వరద నీరు

ముంపు ప్రాంతాల్లో లోకేశ్ పర్యటన


తాడేపల్లి నులకపేటలోని ముంపు ప్రాంతాల్లో ఆదివారం ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. బాధితులతో మాట్లాడారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


కాజలో మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

ముంపునకు గురైన పంటలను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. మండలంలో మునిగిన పంటలను వారు పరిశీలించారు. కాజ, చినకాకాని, ఆత్మకూరు, పెదవడ్లపూడి గ్రామాలలో మునిగిన వరి పంటను పరిశీలించిన ఏడీఏ శ్రీనివాసరెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. నూతక్కి, రామచంద్రాపురంలలో మునిగిన వరి, పసుపు, అరటి పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు చేపట్టాల్సిన జాగ్రత్తలు చెప్పారు.

మునిగిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ


ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లోపల ఇదీ దుస్థితి

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పూర్తిగా ముంపునకు గురైంది. సమీపంలోని కొండవీటి వాగు పొంగడంతో వర్సిటీలోని భవనాలు నీట మునిగాయి. ఇక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాతావరణ కేంద్రమూ జలమయమైంది. 2014–19 మధ్య కాలంలో విద్యాసంస్థలకు అనువు కాని ఈ ప్రాంతంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నిర్మాణానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం భూములు కేటాయించడం గమనార్హం.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి


పాతమంగళగిరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి, దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు


తాడేపల్లిలో వరద బాధితులను పరామర్శిస్తున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి తదితరులు


ముంపుప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి/తాడేపల్లిరూరల్: వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంజి చిరంజీవి, దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రత్నాలచెరువు, పాతమంగళగిరిలోని వరద బాధిత ప్రాంతాలను వారు పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి తక్షణ సాయం అందించాలని, పునరావాస కేంద్రాలకు తరలించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని ముంపు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి నాయకులతో కలిసి పర్యటించారు. బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ముంపు ప్రాంతాల్లోని నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేపట్టాలని, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బత్తుల దాసు, అమర్, బాబి తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పోలకంపాడులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లోని ప్రజలకు ధైర్యం చెప్పారు. మహానాడులోని పలు ప్రాంతాల్లో పర్యటించి కృష్ణానది వరద ఉధృతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొండా విజయ, ఉండ్రు కళ్యాణ్, అంజిరెడ్డి, కొండా విజయ, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.


చినకాకానిలో మునిగిన పొలాలు


కృష్ణానదిలో కొట్టుకు వస్తున్న వరిగడ్డి వాము


కృష్ణానది వరద ఉధృతితో పడవలను ఆపి వలలను మోసుకొస్తున్న మత్స్యకారుడు


మంగళగిరిలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేడు వైఎస్సార్ వర్ధంతి

మంగళగిరి/తాడికొండ : డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం నగరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగే ఈ కార్యాక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నాయకులు గంజి చిరంజీవి కోరారు. గుంటూరులోని మాజీ ఎమ్మెల్యే సుచరిత కార్యాలయంలోనూ వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించనున్నట్టు అక్కడి కార్యాలయవర్గాలు తెలిపాయి.

వక్ఫ్ సవరణ బిల్లుపై తెలుగులో సూచనలిచ్చే అవకాశం ఇవ్వండి

వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రజలు తెలుగులో సూచనలు ఇచ్చే అవకాశం కల్పించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం దుగ్గిరాలలో విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుపై సూచనలను కేంద్రం ఆహ్వానించిందని, వీటిని 15 రోజుల్లోగా అంగ్లం లేదా హిందీ భాషల్లో జాయింట్ సెక్రటరీ లోక్‌సభ సెక్రటేరియట్, రూమ్ నంబర్ 440 పార్లమెంట్ హౌస్ అనెక్స్, న్యూఢిల్లీ చిరునామాకు లేదా jpcwaqf-lss@sansad.nic.in ఈమెయిల్‌కు పంపాలని సూచించిందని వివరించారు. తెలుగు, ముస్లింల మాతృభాషలోనూ సూచనలకు అవకాశం కల్పించాలని కోరారు.